కలుషితమవుతున్న కాలువలు

- వ్యర్థాలు డంప్ చేస్తున్న వైనం
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కార్పొరేట్ కళాశాలలు
- పట్టించుకోని అధికారులు


రామవరప్పాడులో మరుగుదొడ్ల పైపుల ద్వారా కలుషితమవుతున్న రైవస్ కాలువ


బుడమేరులో కలుస్తున్న నిడమానూరులోని ఓ కార్పొరేట్ కళాశాల వ్యర్థ జలాలు

రామవరప్పాడు: నిర్లక్ష్య ధోరణి, అవగాహన లోపం వెరసి పలు గ్రామాల మీదుగా ప్రవహిస్తున్న కాలువలు కాలుష్యకాసారాలుగా మారుతున్నాయి. విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి గ్రామాల మీదుగా ప్రవహిస్తున్న ఏలూరు, రైవస్, బుడమేరు కాలువలే ఇందుకు నిదర్శనం. ఆయా గ్రామాల్లోని కాలువ గట్టు ప్రాంతవాసులు చెత్త, వ్యర్థాలను కాలువల్లోకి డంప్ చేస్తున్నారు. ప్రధానంగా రాత్రుళ్ల కోళ్ల వ్యర్థాలు, కాలం చెల్లిన ఆహార పదార్థాలను కొందరు దొంగచాటుగా తీసుకొచ్చి కాలువల్లో పడేస్తున్నారు. పైగా కాలువగట్ల నివాసితులు తమ తమ మరుగుదొడ్లకు పైపులు అమర్చి నేరుగా కాలువలో కలిసే విధంగా ఏర్పాట్లు చేసుకున్నారు. ఇటువంటి చర్యల కారణంగా కాలువలు మరింత కలుషితం అవుతున్నాయి.

నివారణ చర్యలు నిల్

కాలువల్లో ఇష్టానుసారంగా వ్యర్థాలను డంపింగ్ చేస్తున్నా.. ఆయా గ్రామాల పంచాయతీ, ఇరిగేషన్ అధికారులు మాత్రం ఎటువంటి చర్యలు అవలంభించడం లేదు. కార్పొరేట్ కళాశాలలు అవలంభిస్తున్న తీరు, దొంగచాటుగా వ్యర్థాలు కలుపుతున్న వారిపై నిఘా పెట్టకపోవడంతో రానూరానూ ఇటువంటి చర్యలు అధికమైపోతున్నాయి. గతంలో గ్రామాల్లో రోగాలు వ్యాప్తి చెందకుండా నివారించే చర్యల్లో భాగంగా కాలువలో వ్యర్థాలు పడేసే వారిని గుర్తించి పంచాయతీ అధికారులు నోటీసులు జారీ చేశారు. అప్పట్లో పరిస్థితి కొద్దిగా అదుపులోకి వచ్చినా తర్వాత యదారాజా తదా ప్రజా అన్నట్లుగా మారింది. కాలువలు కలుషితం చేయకుండా కాలువ గట్టు వాసులకు కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలని, ఉద్దేశ్యపూర్వకంగా కలుషితం చేస్తున్న కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలు, వ్యర్థాలు పడేస్తున్న ఆగంతకులను గుర్తించి చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కార్పొరేట్ కళాశాలల వ్యర్థాలు కాలువలోకే..

మండలంలో రామవరప్పాడు నుంచి గూడవల్లి వరకు పదుల సంఖ్యలో కార్పొరేట్ కళాశాలలు, పాఠశాలలు ఉన్నాయి. వీటిలో చాలా వరకు కళాశాలల వ్యర్థాలు బుడమేరు, రైవస్ కాలువల్లోనే కలుపుతున్నారు. కళాశాలల హాస్టల్స్, భోజనశాలల నుంచి నిత్యం వెలువడే వ్యర్థాలను డ్రెయిన్లు, పైపుల ద్వారా కాలువల్లోకి వదులుతున్నా.. సంబంధిత అధికారులకు మాత్రం పట్టడంలేదు. నిబంధనల ప్రకారం ప్రతి కళాశాలలో ఎస్టీపీ ప్లాంటు ఏర్పాటు చేసుకోవాల్సి ఉంది. కాని చాలా వరకు కళాశాలల్లో ఈ ఎస్టీపీ ప్లాంట్లు అలంకారప్రాయంగా తయారయ్యాయి. కళాశాలల్లో తనిఖీలు నిర్వహించి ప్లాంట్లు నిర్వహిస్తున్నారా, వ్యర్థ జలాలను శుద్ధి చేస్తున్నారా వంటి అంశాలను సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి చర్యలు తీసుకోవాలి. ఇవేవి పట్టని అధికారులు చోద్యం చూస్తుండటంతో వీరి చర్యలకు అడ్డుకట్ట పడటం లేదు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామవరప్పాడు: విద్యుత్ లైన్ల మరమ్మతులు, నూతన స్తంభాల ఏర్పాటు నిమిత్తం విజయవాడరూరల్ మండలం ప్రసాదంపాడులో శనివారం ఉదయం 8.30 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ పరమేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని యాదవుల బజార్, వాటర్ ట్యాంక్ ఏరియా, ఎస్సీ కాలనీలో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

యనమలకుదురులో..

పెనమలూరు: విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ నిమిత్తం యనమలకుదురు గ్రామంలో శనివారం ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గౌడబజార్, కొండ వెనుక శివపార్వతీనగర్, మండపం సెంటర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

గ్రామాల ఆదాయ వివరాలు తెలపండి

విజయవాడరూరల్: కూటమి ప్రభుత్వం గ్రామ పంచాయతీల కేటగిరిల్లో మార్పు తీసుకురావడానికి చర్యలు చేపట్టింది. అందులో భాగంగా గత మూడు ఏళ్లుగా గ్రామ పంచాయతీలకు వచ్చిన ఆదాయ వివరాలను తెలియజేయమని కార్యదర్శులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో శుక్రవారం విజయవాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శుల సమావేశం జరిగింది. మండలంలోని ఒక్కో గ్రామ పంచాయతీకి వచ్చిన గత మూడు ఏళ్ల ఆదాయ వివరాలను సేకరించడం జరుగుతుందని ఈఓపీఆర్డీ ఎండీవీ ప్రసాద్ తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే గ్రాంటులను పరిగణలోకి తీసుకోకుండా ఆదాయ వివరాలను సేకరించనున్నారు.

ఆలయానికి విరాళం



పెనమలూరు: పెనమలూరు గ్రామంలో శ్రీకోదండరామ స్వామివారి దేవస్థానానికి పెనమలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయ కర్త దేవభక్తుని చక్రవర్తి విరాళం అందజేశారు. ఈ మేరకు శుక్రవారం చక్రవర్తి పంపిన రూ. 25 వేలు చెక్కును పెనమలూరు సొసైటీ మాజీ అధ్యక్షుడు కొత్తపల్లి వెంకటేశ్వరరావు ఆలయ నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు తెన్నేటి ప్రకాష్, అండ్రాజు శ్రీనివాసరావు, గోగం గోపీ పాల్గొన్నారు.

ముగిసిన ఆధార్ క్యాంపులు

కంకిపాడు: ఆధార్ ప్రత్యేక శిబిరాలు శుక్రవారంతో ముగిశాయి. మండలంలోని కంకిపాడు, ఉప్పలూరు, పునాదిపాడు గ్రామాల్లోని సచివాలయాల్లో ఈనెల 18 నుంచి 21వ తేదీ వరకు ఆధార్ నమోదు క్యాంపులు నిర్వహించారు. ప్రత్యేకించి ఆరేళ్లలోపు చిన్నారులకు ఆధార్ నమోదు చేపట్టారు. మూడు రోజులపాటు నిర్వహించిన శిబిరాల్లో 87 మంది ఆయా గ్రామాల ప్రజలు ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకున్నారు. ఎంపీడీఓ పి.అనూష శిబిరాలను పర్యవేక్షించారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్టా వార్షికోత్సవం



గన్నవరం: మండలంలోని బుద్దవరం గ్రామంలో శ్రీఅభయాంజనేయ స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ ప్రథమ వార్షికోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. తొలుత స్వామివారి ఏకశిల విగ్రహానికి పంచామృత అభిషేకం, నవరాసాభిషేకం, సిందూరభిషేకం, పుష్పాభిషేకాలు జరిపారు. అనంతరం 40 మంది దంపతులచే గణపతి, లక్ష్మీగణపతి, నవగ్రహ, ఆంజనేయ, శాంతి హోమాలను వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నసంతర్పణ చేశారు.

వ్యవసాయ విద్యుత్ మోటార్ల కేబుళ్లు చోరీ

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం రంగన్నగూడెంలో వ్యవసాయ పంపుసెట్ల వద్ద వరుసగా విద్యుత్ మోటార్ల కేబుళ్ల చోరీలు జరుగుతూనే ఉన్నాయి. గ్రామానికి చెందిన నాగార్జున సాగర్ ఎడమకాలువ ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావుకు చెందిన పొలంలోని షెడ్ తాళాలు పగలుకొట్టి గురువారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. దుండగులు సబ్ మెర్సిబుల్ కేబుళ్లతోపాటుగా తైవాన్ స్ప్రేయర్లు, వ్యవసాయ పనిముట్లు, కలుపు మందు డబ్బాలను అపహరించుకుని పోయారు. అదే గ్రామానికి చెందిన ఆళ్ల శివశంకరరావు, పుసులూరి పూర్ణ వెంకటప్రసాద్ వ్యవసాయ పంపు సెట్ల వద్ద కూడా విద్యుత్ మోటార్ల కేబుళ్లను దొంగలు కత్తించుకుని పరారయ్యారు. ఈ చోరీలపై రైతులు వీరవల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

విద్యుత్ సమస్యల పరిష్కారమే లక్ష్యం


విద్యుత్ అదాలత్‌లో సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ ఎస్.విక్టర్ ఇమ్మానియేలు

కంకిపాడు: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారమే తమ లక్ష్యమని సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ ఎస్. విక్టర్ ఇమ్మానియేలు అన్నారు. గుణదల డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యలపై శుక్రవారం కంకిపాడులోని రాయల్ ఫంక్షన్ హాలులో విద్యుత్ అదాలత్ – అవగాహన సదస్సు నిర్వహించారు. పలు గ్రామాల నుంచి వినియోగదారులు అందించిన అర్జీలపై విచారణ జరిపి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ శాఖలో ఉన్న లోపాలను పూర్తి స్థాయిలో సరిచేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వాలు అమలు చేసే రాయితీ పథకాలు అర్హులకు అందకపోయినా విచారణ చేసి పథకాలు అందేలా చేస్తామన్నారు. విద్యుత్ సమస్యలు పునరావృతం కాకుండా బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. వినియోగదారులకు అండగా నిలిచి మెరుగైన సేవలు అందేలా చూడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సాంకేతిక సభ్యులు కె.వెంకటకృష్ణ, ఆర్థిక సభ్యుడు ఆర్ సీహెచ్ శ్రీనివాసరావు, స్వతంత్ర సభ్యుడు ఏ.సునీత, గుణదల ఈఈ పి.హరిబాబు, ఏడీఈ బి.నవీన్‌కుమార్, ఏఈ టీ.అశోక్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ఉద్యోగ సంఘ నాయకుల వినతి


కలెక్టర్ డీకే బాలాజీకి వినతి పత్రం అందజేసిన గ్రంథాలయ సంస్థ ఉద్యోగ సంఘ నాయకులు

గన్నవరం రూరల్: ఉమ్మడి కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థకు చెల్లించాల్సిన సెస్ బకాయిల విడుదలకు చర్యలు తీసుకోవాల్సిందిగా కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీకి ఆ సంస్థ ఉద్యోగుల సంఘం నాయకులు శుక్రవారం వినతి పత్రాన్ని అందజేశారు. మచిలీపట్నంలోని కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కె.కృపానందం ఆధ్వర్యాన కలెక్టర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల ద్వారా గ్రంథాలయ సంస్థకు రావాల్సిన సెస్ బకాయిలు విడుదల చేయించి, గ్రంథాలయాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. అనంతరం కలెక్టర్ బాలాజీ సూచనల మేరకు సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహ విద్యార్థులకు రూ. 2వేలు విలువ చేసే స్టడీ ప్యాడ్స్, జామెంట్రీ బాక్స్‌లు, పెన్నులు, చిన పిల్లలు చదువుకునే కథల పుస్తకాలు అందజేశారు. ఉద్యోగ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.చినరాజు, మహిళా అధ్యక్షురాలు కోగంటి పద్మావతి, అసోసియేట్ అధ్యక్షుడు సుబ్రమణ్యేశ్వరరావు, సాలార్ షరీఫ్, ఎస్‌కే రఫీ, తోకల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి


నగదు ప్రోత్సాహకాలు అందుకున్న విద్యార్థులు

ఉంగుటూరు: విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదల, ప్రణాళికతో విద్యను అభ్యసించాలని తహసీల్దార్ జాలాది విమల కుమారి అన్నారు. ఉంగుటూరు మండలం తేలప్రోలులోని డాక్టర్ భీమవరపు కృష్ణారెడ్డి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పెట్ల పార్వతి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యాన శుక్రవారం ప్రతిభగల విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు ట్రస్ట్ నిర్వాహకులు నగదు ప్రోత్సాహకాలను అందజేయడం అభినందనీయమని అన్నారు. గ్రామంలో ఒకటవ తరగతి నుంచి ఇంజినీరింగ్ వరకు విద్యలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. కార్యక్రమంలో జెఎన్‌టీయూ ప్రొఫెసర్ గుర్రం సాగర్, సర్పంచ్ లాం దిబోర, శాతవాహన కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ ఉయ్యూరు సాంబిరెడ్డి, ట్రస్ట్ నిర్వాహకులు పెట్ల కామేశ్వరరావు, వింత ముత్తారెడ్డి, భీమవరపు సుబ్బారెడ్డి, మోదుగు భానుప్రకాష్, హెచ్ఎం వేలూరి వెంకట ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులకు రాస్ప్బెర్రీపై వర్క్‌షాపు


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

నున్న(విజయవాడరూరల్): ఇంజినీరింగ్ విద్యార్థులు తమ సబ్జెక్టులపై అవగాహన పెంపొందించుకొని సమస్యలను పరిష్కరించే విధంగా సామర్థ్యం కలిగి ఉండాలని వికాస్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఛైర్మన్ నరెడ్ల నర్సిరెడ్డి అన్నారు. నున్న గ్రామంలోని వికాస్ కాలేజ్‌లో శుక్రవారం ఈసీఈ చదువుతున్న విద్యార్థులకు రాస్ప్బెర్రీపై వర్క్ షాపు నిర్వహించారు. అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు తమ నూతన ఆలోచనల ద్వారా వివిధ రంగాల్లో పలు సమస్యలకు వారి ఆలోచనలను జోడించి సమస్యలను ఎలా పరిష్కరించవచ్చునో వివరించారు. ఎస్ఆర్‌సీ ఈసొల్యూషన్స్ టెక్నికల్ ఇంజినీర్ డాక్టర్ పి.అశోక్ చక్రవర్తి విద్యార్థులకు ప్రాజెక్ట్ ఎలా డిజైన్ చేయాలో తెలియజేశారు. వర్క్‌షాపులో అకడమిక్ డైరెక్టర్ నరెడ్ల కీర్తిరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ సి.హెచ్. పరమేశ్వరరావు, డీన్ డాక్టర్ సేవుగరాజన్, ఈసీఈ విభాగాధిపతి బి. వెంకటేశ్వరరెడ్డి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కిషోర్‌బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మహిళలు, బాలికల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ

హనుమాన్‌జంక్షన్ రూరల్: మహిళలు, బాలికల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చడంతో పాటు సంఘ వ్యతిరేక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని కృష్ణా జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు తెలిపారు. హనుమాన్‌జంక్షన్ పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం రాత్రి ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పెండింగ్ కేసుల పురోగతి, రికార్డుల నిర్వహణపై వివరాలను ఆరా తీశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ హనుమాన్‌జంక్షన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో క్రైం రేట్ తగ్గిందని, కానీ రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరగటం ఆందోళనకరమన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు బ్లాక్‌స్పాట్‌లను గుర్తించటం, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయటం, వాహనదారులకు అవగాహన కల్పించటం వంటి చర్యలు తీసుకుంటామని వివరించారు. హనుమాన్‌జంక్షన్ పోలీస్‌స్టేషన్ శిథిలావస్థకు చేరటంతో నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపుతున్నట్లు ఆయన వివరించారు. జంక్షన్ ఇన్‌చార్జి సీఐ శివప్రసాద్, ఎస్ఐలు సురేష్, లక్ష్మీపతి నరసింహామూర్తి పాల్గొన్నారు.

ఆప్కాస్ ఉద్యోగులు ఆందోళన బాట



కళాశాల వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

గన్నవరం: స్థానిక ఎన్టీఆర్ పశువైద్య కళాశాలలో పని చేస్తున్న ఆప్కాస్(ఏపీ కార్పొరేషన్ ఆఫ్ అవుట్ సోర్సింగ్ సర్వీసెస్) ఉద్యోగులు తమ జీతాలు పెంచాలని కోరుతూ ఆందోళన బాట పట్టారు. ఈ మేరకు శుక్రవారం కళాశాల ప్రధాన ద్వారం వద్ద ఉద్యోగులు తమ నిరసనను ప్రభుత్వానికి తెలియజేశారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు మేడూరి శేషబాబు మాట్లాడుతూ ఎన్టీఆర్ పశువైద్య కళాశాలను స్థాపించి పాతికేళ్లు గడుస్తున్నా ఇంతవరకు ఒక్క ప్రభుత్వ నియామకం చేపట్టలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆప్కాస్ విధానాన్ని తొలగించి తిరిగి ప్రైవేట్ ఏజెన్సీల చేతులకు ఉద్యోగులను అప్పగించాలని చూడటం దుర్మార్గమన్నారు. యూనియన్ ఉపాధ్యక్షులు అంజిబాబు, కార్యదర్శి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులు పరిశోధనలపై దృష్టి పెట్టాలి



పర్వీన్ అహ్మద్‌ను సన్మానిస్తున్న కాలేజీ యాజమాన్యం

పెనమలూరు: విద్యార్థులు పరిశోధనలపై దృష్టి పెట్టి నూతన ఆవిష్కరణలతో ప్రతిభ చాటాలని టీసీఎస్ టాలెంట్ అక్విజిషన్ గ్రూప్ తెలంగాణ, ఏపీ రీజినల్ హెడ్ పర్వీన్ అహ్మద్ సూచించారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ డీమ్డ్ టు బీ యూనివర్సిటీలో శుక్రవారం జాతీయ స్థాయిలో సుప్రజ్ఞ–2025 టెక్నోఫెస్టు కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా పర్వీన్ అహ్మద్ మాట్లాడుతూ విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించడానికి టెక్నోఫెస్టులు వేదికగా ఉపయోగించుకోవాలని సూచించారు. ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్ మాట్లాడుతూ టెక్నోఫెస్టులో దేశవ్యాప్తంగా దాదాపు 300 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. ఫెస్టులో సర్క్యూట్ సర్జ్, ఎలక్ట్రో ఐక్యూ, లోగో హంట్ కోడ్ విజర్డ్స్ వెంట్స్ టెక్ ప్రియుల కోసం ప్రత్యేకంగా రూపొందించారు. అనంతరం పర్వీన్ అహ్మద్‌ను సన్మానించారు. కార్యక్రమంలో సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు ఎం.రాజయ్య, సుప్రజ్ఞ కన్వీనర్ డాక్టర్ ఎం.పద్మజ, పలు విభాగాల అధిపతులు డాక్టర్ రాజేశ్వరరావు, డాక్టర్ వెంకట్రావు, డాక్టర్ సునీత, అసిస్టెంట్ ప్రొఫెసర్ స్నేహ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు సితార్ 2కే25

కానూరు పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో జాతీయ స్థాయిలో టెక్నోకల్చర్ ఫెస్టు సితార్–2కే25 నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు తెలిపారు. శనివారం ఉదయం 9.30 గంటలకు జరిగే సితార్ కార్యక్రమంలో దేశంలోని పలు ఇంజినీరింగ్ కాలేజీల విద్యార్థులు పాల్గొంటారని పేర్కొన్నారు.

సకాలంలో సమస్యలను పరిష్కరించాలి


మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి సుబ్బారావు

ఉయ్యూరురూరల్: ఉయ్యూరు డిపోలో నెలకొన్న సమస్యలను సకాలంలో పరిష్కరించాలని ఎన్ఎంయూఏ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రావి సుబ్బారావు డిమాండ్ చేశారు. ఉయ్యూరు డిపో ఎదుట గత ఎనిమిది రోజులుగా జరుగుతున్న రిలే నిరాహార దీక్షలో శుక్రవారం ఆయన పాల్గొని మాట్లాడారు. డిపోలో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎన్టీఆర్ జిల్లా జాయింట్ సెక్రటరీ సురేష్ కుమార్, పబ్లిసిటీ సెక్రటరీ మల్లేశ్వరనాయక్, ఆటోనగర్ డిపో కార్యదర్శి ఎంఎస్ రావు, పబ్లిసిటీ సెక్రటరీ హుస్సేన్, డ్రైవర్ అసోసియేషన్ సెక్రటరీ నాన్నయ్య, కృష్ణాజిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ రాంబాబు దీక్షకు మద్దతిచ్చారు.

రంగు చేపలతో ఉపాధి అవకాశాలు


శిక్షణ పొందిన మహిళకు సర్టిఫికెట్ అందజేస్తున్న సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ రమేష్‌రాథోడ్

పెనమలూరు: రంగు చేపల పెంపకంతో మహిళలకు ఉపాధి అవకాశాలు కలుగుతాయని పోరంకిలోని సేంద్రియ మంచినీటి జీవపాలన సంస్థ, ప్రాంతీయ పరిశోధన కార్యాలయం ఇన్‌చార్జ్, సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ రమేష్ రాథోడ్ అన్నారు. పోరంకిలోని ప్రాంతీయ కార్యాలయంలో గత మూడు రోజులుగా తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా మల్లవరం గ్రామ స్వయం సహాయ సంఘం మహిళా సభ్యులకు చేపల రంగంలో వ్యవస్థాపకత అభివృద్ధిపై శుక్రవారం ముగిసిన శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. నేడు రంగు చేపలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని, వీటిని ఇంట్లో అలంకరణకు పెంచుకోవటానికి ప్రజలు చాలా ఆసక్తి చూపుతున్నారని వివరించారు. సైంటిస్టు అజితేశవ్ చౌదరి మాట్లాడుతూ గ్లాస్ అక్వేరియమ్, చేపల మేత తయారు చేయటం నేర్చుకుంటే వ్యాపారం వృద్ధి చేసి లాభాలు పొందవచ్చన్నారు. మూడు రోజుల శిక్షణలో దీనిపైనే ప్రత్యేకంగా అవగాహన కల్పించామన్నారు. అనంతరం శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. నాగాయలంక బావదేవరపల్లి మత్స్య పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా మాతృభాషా దినోత్సవం


దుర్గాప్రసాద్ దంపతులను సత్కరిస్తున్న లయన్స్ ప్రతినిధులు

ఉయ్యూరు: లయన్స్‌క్లబ్ ఆఫ్ ఉయ్యూరు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాతృభాషాభివృద్ధికి కృషి చేస్తున్న సరసభారతి సాహిత్య సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు గబ్బిట దుర్గాప్రసాద్ దంపతులను సత్కరించారు. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ మాతృభాషపై పట్టు ఉంటేనే ఏ భాషలో అయినా రాణించొచ్చన్నారు. తన ఊపిరి ఉన్నంత కాలం తెలుగు భాషాభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు నేరెళ్ల తేజ, నెల్లి రాంబాబు, దీనవహి ప్రసాద్, పాగిరి రాము, నల్లా శ్రీనివాస్, హసన్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం రేమల్లేలోని జెడ్పీ హైస్కూల్‌లో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. తెలుగు వ్యవహారిక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు దారపురెడ్డి భాస్కరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. తెలుగు భాషను పరిరక్షించుకుని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సూచించారు. తెలుగు ఉపాధ్యాయులు వెంకటేశ్వర దేవి, పార్థసారథి తెలుగు కవులు, కళాకారుల జీవిత విశేషాలను వివరించారు. ఉపాధ్యాయులు వెంకటకుమారి, పద్మ, రాజశేఖర్, రాజేష్, సునీత, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

వంశీ సతీమణిని కలిసిన వైఎస్సార్ సీపీ నాయకులు

రామవరప్పాడు: అక్రమ కేసులో అరెస్టు అయిన గన్నవరం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ భార్య వల్లభనేని పంకజశ్రీని శుక్రవారం వైఎస్సార్ సీపీ రూరల్ మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడ సబ్ జైలులో వంశీతో పంకజ ములాకత్ అయ్యారు. విషయం తెలుసుకున్న పార్టీ నాయకులు ఆమెను కలిసి సంఘీభావం తెలిపారు. వంశీ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు గోసుల శివభరత్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు చెన్ను ప్రసన్నకుమారి, యార్కారెడ్డి నాగిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు అన్నవరపు ఎలిజిబెత్ రాణి, గంగాభవాని, ఎనికేపాడు సర్పంచ్ రాచమళ్ల పూర్ణ, రామవరప్పాడు కన్వీనర్ సమ్మెట సాంబశివరావు తదితరులు కలిసిన వారిలో ఉన్నారు.

విగ్రహ ప్రతిష్టా మహోత్సవం

పెనమలూరు: పెనమలూరు గ్రామం హైస్కూల్ సెంటర్‌లోని శ్రీకోదండరామాలయంలో స్వామివార్ల నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు శుక్రవారం ప్రారంభించారు. గ్రామంలో మూడు రోజులపాటు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. మొదటి రోజు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. కాగా శనివారం అగ్నిప్రతిష్ఠ, హోమం, నూతన విగ్రహాలు, ధ్వజస్తంభం గ్రామోత్సవం చేస్తారు. ఈ నెల 23న ధ్వజస్తంభ ప్రతిష్ఠ, శ్రీసీతారామ, లక్ష్మణ ఆంజనేయ ద్వారపాలకుల విగ్రహాలు ప్రతిష్ఠిస్తారు.

రీసర్వే పనులను పరిశీలించిన ఉన్నతాధికారులు



గన్నవరం: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూముల రీసర్వేలో భాగంగా శుక్రవారం మండలంలోని కేసరపల్లి శివారు వెంకట నరసింహాపురం గ్రామ సరిహద్దులు, భౌగోళిక సత్య నిర్ధారణ నిర్వహించారు. ఈ ప్రక్రియను ఏపీ స్టేట్ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అకాడమీ జాయింట్ డైరెక్టర్, వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్‌వీఎస్ఎస్ కుమార్, గుడివాడ ఆర్డీఓ జి.బాలసుబ్రమణ్యం, తహసీల్దారు కె.వెంకటశివయ్య స్వయంగా తనిఖీ చేశారు. తహసీల్దారు మాట్లాడుతూ ఇప్పటి వరకు 420 ఎకరాల్లో రీసర్వే ప్రక్రియ పూర్తయిందన్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను మీభూమి వెబ్ సైట్ ద్వారా చూడవచ్చని తెలిపారు. ఎటువంటి సమస్యలు ఎదురైనా రైతులు స్థానిక తహసీల్దారు కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

ప్రైవేట్ ఆసుపత్రి ఎదుట ఆందోళన

ఉయ్యూరు రూరల్: పమిడిముక్కల పంచాయతీ పరిధిలోని పాల సేకరణ కేంద్రంలో పనిచేస్తున్న గురువిందపల్లి వెంకటేశ్వరరావు గత ఐదు రోజుల క్రితం మోటార్ బైక్‌పై నుంచి పడిపోయాడు. దీంతో ఉయ్యూరులోని రిలయన్స్ మార్ట్ దగ్గరలో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వెంకటేశ్వరరావుకు సరైన వైద్యం అందించకపోవడంతో ఐదు రోజుల తర్వాత కాళ్లు రెండు చచ్చుపడి నడవలేని స్థితి ఏర్పడింది. దీంతో వెంకటేశ్వరరావు భార్య, అతని బంధువులు ఆసుపత్రి ఎదుట బైఠాయించి ఆందోళన చేశారు. నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమాచారం తెలుసుకున్న పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని శాతియుతంగా పరిష్కారం చేసుకోవాలని సూచించడంతో బాధితులు ఆందోళన విరమించారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

కంకిపాడు: లయన్స్ క్లబ్ ఆఫ్ కంకిపాడు ఆధ్వర్యాన శనివారం కంకిపాడులోని స్మైల్ లైఫ్‌కేర్ హాస్పిటల్ ప్రాంగణంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు క్లబ్ ప్రతినిధి ఎం.గోవిందరావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు వైద్య శిబిరం జరుగుతుందన్నారు. వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందిస్తారని పేర్కొన్నారు.